రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రోజాబాల్ రెడ్డి

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

బొల్లారం డిసెంబర్ 14: మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు గాంధీనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ రోజా బాల్ రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మున్సిపల్ నిధులతో ప్రణాళికాబద్ధంగా వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కాలనీవాసులు ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బాలమణి రత్నం, ఏఈ కిష్టయ్య, స్థానికులు యాదగిరి, వీరేశం, విష్ణు, గోష్, మహిళలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వానికి చిత్త శుద్ధిలేదు

అందోల్, డిసెంబర్ 14: ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వానికి, అందోల్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహకు చిత్తశుద్ధి లేదని ఎమ్మార్పీస్ నాయకుడు కుమార్ శనివారం ప్రకటనలో ఆరోపించారు. వారికి నిజంగా వర్గీకరణపై చిత్తశుద్ధి ఉంటే ఇప్పటివరకు వచ్చిన నోటిఫికేషన్లు, ఉద్యోగాలు భర్తీ చేయకుండా ఆదేశాలివ్వాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేసే ఉద్దేశం కాంగ్రెస్‌కు లేదని.. కమిటీల పేరుతో కాలయాపన చేయడమే ఆ పార్టీ, ప్రభుత్వం ఉద్దేశమన్నారు.

గానుగాపూర్‌కు ప్రత్యేక బస్సు సర్వీసులు

జహీరాబాద్, డిసెంబర్ 14: జహీరాబాద్ ఆర్టీసీ డిపో నుంచి కర్ణాటక రాష్ట్రంలోని గానుగాపూర్ దత్తాత్రేయ స్వామి ఆలయానికి భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు సంగారెడ్డి రీజినల్ మేనేజర్ ఎంఈ ప్రభులత, జహీరాబాద్ డిపో మేనేజర్ జాకీర్‌హుస్సేన్ తెలిపారు. ఆదివారం దత్తజయంతిని పురస్కరించుకొని స్వామివారి దర్శనానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడుతున్నామన్నారు. ఈ బస్సు సౌకర్యాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బిలాల్‌పూర్‌లో ఘనంగా బోనాలు

కోహీర్, డిసెంబర్ 14: మండలంలోని బిలాల్‌పూర్ గ్రామంలో మల్లికార్జునస్వామి ఆలయ ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం బోనాల ఊరేగింపు నిర్వహించారు. అందంగా అలంకరించిన బోనాలతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించి ఊరడమ్మ, మైసమ్మ దేవతలకు బోనాలను సమర్పించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నర్సింహులు, భక్తులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయ వ్యవస్థాపక దినోత్సవం

మాట్లాడుతున్న నాయబ్ తహసీల్దార్ యాసిన్‌ఖాన్

ఝరాసంగం, డిసెంబర్ 14: మండల పరిధిలోని మాచనూర్ శివారులోని కేంద్రీయ విద్యాలయంలో శనివారం 62వ కేంద్రియ విద్యాలయ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు నాయబ్ తహసీల్దార్ యాసిన్‌ఖాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో విద్యాలయ ప్రిన్సిపాల్ పవన్‌కుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

లబ్ధిరులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి

కంగ్టి, డిసెంబర్ 14: కంగ్టి ఎంపీపీ సమావేశ మందిరంలో శనివారం లబ్ధిదారులకు నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్ రెడ్డి కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై పట్టింపేది?

- యథేచ్ఛగా పరిశ్రమల ఘన వ్యర్థాల డంప్
- ఇష్టారీతిన కాల్చివేస్తున్నా పట్టించుకోని అధికారులు

బహిరంగ ప్రదేశాల్లో ట్రాక్టర్ల ద్వారా పరిశ్రమల నుంచి తీసుకువచ్చిన ఘన వ్యర్థాలను డంపు చేస్తున్న దృశ్యం

పరిశ్రమల ఘన వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో డంపు చేస్తూ కాల్చి వేయడంపై స్థానికులు ఆగ్రహం చేస్తున్నారు. శనివారం బొల్లారం పారిశ్రామిక వాడలోని పలు పరిశ్రమలకు చెందిన ఘన వ్యర్థాలను ట్రాక్టర్ల ద్వారా బహిరంగ ప్రదేశాల్లో డంపు చేసి కాల్చివేయడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో పలుమార్లు ఘన వ్యర్థాలను కాల్చివేసి వాయు కాలుష్యాన్ని సృష్టించిన ఘటనలపై అటు పీసీబీ, ఇటు మున్సిపల్ అధికారులు నామమాత్రంగా తనిఖీలు చేసి చర్యలు తీసుకోకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి ఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నా అధికారుల చర్యలు మాత్రం శూన్యమన్నారు. ఇప్పటికైనా బాధ్యులైన వారిపై చర్యలు తీసుకొని ప్రజారోగ్యాన్ని కాపాడాలని బొల్లారం పారిశ్రామిక వాడ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

- బొల్లారం, డిసెంబర్ 14

రాజీతో కేసుల పరిష్కారం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర
- జాతీయ లోక్ అదాలత్‌లో 5,138 కేసులు పరిష్కారం

లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీ చంద్ర

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 14: రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకొని కలిసిమెలిసి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర పేర్కొన్నారు. జాతీయ, రాష్ట్రీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో మొత్తం 5,138 కేసుల పరిష్కారమయ్యాయన్నారు. రాజీ చేయదగిన పోలీసు కేసులు, భార్యాభర్తల మధ్య చిన్న చిన్న వివాదాలు, ఎక్సైజ్ కేసులు, బ్యాంక్ తదితర కేసులు, రాజీ చేయదగిన కేసుల్లో ఇరువర్గాలు లోక్ అదాలత్ ద్వారా రాజీ కుదుర్చుకోవచ్చని పేర్కొన్నారు. క్షణికావేశంలో తగాదా పడి కేసులతో కోర్టుల చుట్టూ తిరుగుతూ విలువైన సమయాన్ని, డబ్బును వృథా చేసుకోవద్దని సూచించారు. శనివారం పరిష్కరించిన కేసుల్లో లోక్ అదాలత్‌లో 4,656 క్రిమినల్ కాంపౌండేబుల్ కేసులు, 11 సివిల్ కేసులు, రూ.99 లక్షల 66 వేలకు సంబంధించిన 16 మోటారు వాహన ప్రమాద పరిహారం కేసులు, మూడు ప్రీ లిటిగేషన్ కేసులు, రూ.కోటీ 90 లక్షల 11 వేల 500కు సంబంధించిన బ్యాంకు రికవరీ కేసులు, రూ.10 లక్షల 43 వేల 343లకు సంబంధించిన సైబర్ క్రైమ్ కేసులు, రూ.14 కోట్ల 66 లక్షల 68 వేల 25కు సంబంధించిన భూసేకరణ కేసులు, రూ.2 లక్షలకు సంబంధించిన 72 విద్యుత్ చౌర్యం కేసులు ఉన్నాయని వివరించారు. ఈ లోక్ అదాలత్‌లో జిల్లా మొదటి అదనపు సెషన్ జడ్జి జయంతి, జిల్లా మూడో అదనపు సెషన్స్ జడ్జి సునీతారవీంద్ర రెడ్డి, సీనియర్ సివిల్ జడ్జి రాధాకృష్ణ చౌహాన్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్, మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి, ఎక్సైజ్ కోర్టు తేజశ్రీ, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రభుత్వ ప్లీడర్ ప్రభుధాన్యం, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సత్యనారాయణ, కోర్టు ఇబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

చురుగ్గా ఇందిరమ్మ ఇండ్ల సర్వే

హత్నూరలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

కలెక్టర్ వల్లూరు క్రాంతి

హత్నూర, డిసెంబర్ 14: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియ జిల్లాలో చురుకుగా కొనసాగుతున్నట్లు కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. శనివారం మండల కేంద్రమైన హత్నూరలో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న కుటుంబీకులతో మాట్లాడి వివరాలు సేకరించారు. పూర్తి వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదుచేయాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో కొనసాగుతున్న సర్వే ప్రక్రియ చురుకుగా సాగుతున్నదని చెప్పారు. సర్వేలో ఇందిరమ్మ కమిటీ సభ్యుల సహకారం తీసుకోవాలని అధికారులకు కోరారు. సర్వేలో అవకతవకలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈవో స్వప్న, ఎంపీడీవో శంకర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి మహేశ్, మాజీ సర్పంచ్ వీరస్వామిగౌడ్ పాల్గొన్నారు.

నేడు ఐలాపూర్‌కు హరీశ్‌రావు రాక

ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కుమార్‌యాదవ్, ఆదర్శ్‌రెడ్డి

అమీన్‌పూర్, డిసెంబర్ 14: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ఐలాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ యువ నాయకుడు మాణిక్ యాదవ్ ఆధ్వర్యంలో వారం రోజులుగా కేసీఆర్ క్రికెట్ ట్రోఫీ నిర్వహిస్తున్న సందర్భంగా ముగింపు వేడుకలకు మాజీ మంత్రి సిద్దిపేట శాసనసభ్యుడు తన్నీరు హరీశ్‌రావు హాజరు కానున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు మాణిక్‌యాదవ్ మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం కేసీఆర్ క్రికెట్ ట్రోఫీలో గెలుపొందిన విజేతలకు బహుమతులను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మాజీ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా ప్రదానోత్సవ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ ఏర్పాట్లను శనివారం పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, సింధూ ఆదర్శ్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్లు కవితాశ్రీనివాస్‌రెడ్డి, బిజిలీ రాజు, కోఆప్షన్ సభ్యుడు యూనుస్ తదితరులు పాల్గొని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

దత్తగిరిలో దత్త, చండీ మహా యజ్ఞం

దత్త, చండీ యాగంలో పాల్గొన్న రుత్విక్కులు, భక్తులు

ఝరాసంగం, డిసెంబర్ 14: దత్త జయంతి ఉత్సవాల సందర్భంగా శనివారం మండలంలోని బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో ఆశ్రమ పీఠాధిపతులు అవధూత గిరి మహారాజ్, డాక్టర్ సిద్ధేశ్వర స్వామి ఆధ్వర్యంలో 21 యజ్ఞ గుండాల్లో రెండో రోజు దత్తాత్రేయ యజ్ఞం, చండీ మహా యజ్ఞం నిర్వహించారు. గురు పూజతో ప్రారంభమైన గణపతి పూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వరణం, మండపారాధన, ఆవాహిత దేవ పూజ, యంత్రపూజ, చండీ పారాయణం, మహా మంగళహారతి, యోగిని బలి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. యాగానికి 100 మంది దంపతులు హాజరయ్యారు. యజ్ఞానికి జహీరాబాద్‌కు చెందిన వేద పండితులు, హైదరాబాద్‌కు చెందిన పరమేశ్వర శాస్త్రీ, కుప్పానగర్ గ్రామానికి చెందిన శివశంకర్ స్వామి, చిన్న శంకరంపేటకు చెందిన శివ శక్తి సారధ్యం వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కార్ణాటక, మహారాష్ట్రకు చెందిన భక్తులు హాజరై దత్తాత్రేయ స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మాతృశ్రీ అనసూయమాత, దత్తగిరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అల్లాడి వీరేశం, విశ్వ మానవ ధర్మ ప్రచారం కార్యదర్శి శేరి నార్సింగ్‌రావు, తిరుమలేశ్ పాల్గొన్నారు.

అందోల్‌లో 204 కేసులు పరిష్కారం

అందోల్: జోగిపేటలో లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జడ్జి ధనలక్ష్మి

అందోల్, డిసెంబర్ 14: లోక్ అదాలత్‌లో 204 కేసులు పరిష్కరించినట్లు జోగిపేట జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ధనలక్ష్మి తెలిపారు. శనివారం కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్ ద్వారా సివిల్, క్రిమినల్‌కు సంబంధించిన 204 కేసులను పరిష్కరించడంతోపాటు బాధితులకు న్యాయ పరమైన సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రజలు ప్రతీ చిన్న విషయానికి కేసుల వరకు వెళ్తూ కోర్టుల వరకు వస్తున్నారని, ఇది సరైంది కాదన్నారు. రాజీ కుదుర్చుకునే అవకాశం ఉన్న కేసుల్లో రాజీ కుదుర్చుకొని కేసులను పరిష్కరించుకునేందుకు అవకాశం ఉందని, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జహీరాబాద్‌లో..

జహీరాబాద్, డిసెంబర్ 14: జహీరాబాద్ పట్టణంలోని మున్సిఫ్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ ఆదాలత్ విజయవంతమైంది. మండల లీగల్ సర్వీస్ సెల్ కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి సూరి కృష్ణల ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్ ఆదాలత్‌లో 95 కేసులు పరిష్కరం అయ్యాయి. వివిధ కేసులకు సంబంధించి రూ. 1.35 కోట్లు వసూలు అయ్యాయి. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, న్యాయవాదులు, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

హత్నూర: స్టోర్‌రూంలో కిరాణ సామగ్రిని పరిశీలిస్తున్న మంత్రి కొండా సురేఖ

గురుకులాల్లో కామన్ డైట్ మెనూ ప్రారంభం

గురుకులాలు, వసతి గృహాల్లో ఫుడ్ ఫాయిజన్ కేసులు, ఆహార నాణ్యతపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు శనివారం గురుకులాల బాటపట్టారు. కామన్ డైట్ మెనూ ప్రారంభించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలన్నారు. పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ పర్యటన సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. గురుకులాల్లో నెలకొన్న సమస్యల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. మంత్రి కొండా సురేఖ హత్నూరలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాలలో కలెక్టర్ వల్లూరు క్రాంతితో కలిసి మెనూ చార్ట్‌ను ఆవిష్కరించారు. వంట సరుకులు పరిశీలించిన మంత్రి నాసిరకంగా ఉండటంతో కళాశాల ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

పటాన్‌చెరు: విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, డిసెంబర్ 14

ఎమ్మెల్సీ కవితను కలిసిన బీఆర్ఎస్వీ నేతలు

ఎమ్మెల్సీ కవితతతో బీఆర్ఎస్వీ నాయకుడు క్రాంతి, తదితరులు

రామచంద్రాపురం, డిసెంబర్ 14: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను బీఆర్ఎస్వీ పటాన్‌చెరు సర్కిల్ అధ్యక్షుడు వలేశెట్టి క్రాంతి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో నెలకొన్న విద్యార్థుల సమస్యలను ఎమ్మెల్సీ కవిత దృష్టికి తీసుకువెళ్లారు. శాసనమండలిలో విద్యార్థుల సమస్యలపై మాట్లాడాలని బీఆర్ఎస్వీ నేతలు ఎమ్మెల్సీని కోరారు. రాష్ట్రంలో నెలకొన్న విద్యార్థుల సమస్యలపై తప్పనిసరిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఆమె వారికి తెలిపారు. సాయి, వర్షి, సునీల్, దినేశ్ తదితరులు ఉన్నారు.

రైతులకు డ్రిప్ పరికరాలు పంపిణీ

డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలను పంపిణీ చేస్తున్న అధికారి పండరీనాథ్

జహీరాబాద్, డిసెంబర్ 14: ప్రభుత్వం సబ్సిడీ ద్వారా మంజూరు చేసిన డ్రిప్, స్ప్రింక్లర్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జహీరాబాద్ ఉద్యానవన శాఖ అధికారి సీహెచ్ పండరీనాథ్ అన్నారు. శనివారం న్యాల్‌కల్ మండలంలోని టేకూర్, మిర్జాపూర్(బి), ముంగి, న్యాల్‌కల్ గ్రామాలకు చెందిన రైతులకు ఉద్యానవన శాఖ ద్వారా సబ్సిడీపై మంజూరైన డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, తాజా మాజీ సర్పంచ్‌లు మల్లారెడ్డి, అమీర్, సంతోష్‌కుమార్, మహింద్ర ఈపీసీ కంపెనీ అధికారులు జైపాల్‌రెడ్డి, సుందర్‌కుమార్, గుండయ్యస్వామి, రైతులు పాల్గొన్నారు.

సీఎస్ఆర్ హెల్త్ క్యాంపునకు స్పందన

వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

గుమ్మడిదల, డిసెంబర్ 14: న్యూలాండ్ ల్యాబ్ పరిశ్రమ నిర్వహించిన మెగా హెల్త్ క్యాంపునకు స్పందన వచ్చింది. శనివారం మండలంలోని దోమడుగు పంచాయతీ ప్రాంగణంలో సీఎస్ఆర్ ఉచిత మెగా హెల్త్ క్యాంపును ఎంపీడీవో ఉమాదేవి ప్రారంభించారు. డాక్టర్ అడ్రియన్, కార్పొరేట్ దవాఖాన శ్రీకర, మ్యాక్సి విజన్ వైద్యులు పలు రకాల వైద్య పరీక్షలు చేసి సలహాలు సూచనలు చేశారు. కంటి అద్దాలు, మందుల కిట్లను ప్రజలకు అందజేశారు. కంటి పరీక్షలు, గైనకాలజీ, ఆర్థోపెడిక్, బీఎంఎస్, థైరాయిడ్, బీపీ, షుగర్ సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. దీనికి దోమడుగులోని ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఉచిత మెగా హెల్త్‌క్యాంపు సద్వినియోగం చేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గోవర్ధన్ గౌడ్, ప్రజాప్రతినిధులు న్యూలాండ్ పరిశ్రమ ఏసీఎం రఘునాథ్, హెచ్ఆర్ అడ్మిన్లు వీరప్రసాద్, లక్ష్మణ్, శ్రీధర్‌నాయుడు పాల్గొన్నారు.

సీపీఎం మహా సభల పోస్టర్ ఆవిష్కరణ

మహా సభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజయ్య

బొల్లారం, డిసెంబర్ 14: జిన్నారం మండలం ఖాజీపల్లి పారిశ్రామికవాడలోని టీఐడీసీ పరిశ్రమ వద్ద సీపీఎం రాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవరి 25 నుంచి 28వ తేదీ వరకు జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో నిర్వహించ తలపెట్టిన సీపీఎం రాష్ట్ర నాలుగో మహా సభలకు ప్రజలు, కార్మిక, కర్షక వర్గాలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్ర మహా సభల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, కర్షక, కార్మిక వర్గాలకు సంబంధించిన అనేక అంశాలపై లోతైన చర్చ జరపనున్నట్లు తెలిపారు. పొలిట్ బ్యూరో ప్రతినిధులు, కేంద్ర, రాష్ట్ర నాయకులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వరరావు, శ్రీరాములు, రాజు, ప్రభాకర్, రాములు, నర్సింహులు, సీపీఎం కార్మిక సంఘం ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో విద్యా వ్యవస్థ నిర్వీర్యం

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, డిసెంబర్ 14: కాంగ్రెస్ ప్రభుత్వం నారాయణఖేడ్ నియోజకవర్గానికి విద్యాపరంగా చేసిందేమి లేదని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ఆరోపించారు. శనివారం నారాయణఖేడ్‌లోని తన నివాసంలో ఏర్పాటు విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో కానీ, ప్రస్తుతం కానీ నియోజకవర్గంలో ఒక్క గురుకుల పాఠశాల ఏర్పాటు చేయలేదన్నారు. ఎన్టీఆర్ ప్రభుత్వ హయాంలో రెండు గురుకులాలు ఏర్పాటు కాగా, తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కేసీఆర్ ప్రభుత్వం ఎనిమిది గురుకుల విద్యాలయాలను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాలకు మెస్ చార్జీలు ఇవ్వలేక ఇబ్బందులు పడుతున్నదన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు డిగ్రీ కళాశాల విద్యార్థులకు డ్యూయల్ డెస్క్ బెంచీలను మంజూరు చేయించినట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు రవీందర్‌నాయక్, ముజామ్మిల్, శ్రీనివాస్, రాజునాయక్, సిద్దు, అంజాగౌడ్ ఉన్నారు.

పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి

ఉమ్మడి మెదక్ జిల్లా హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు మెట్టు శ్రీధర్

మాట్లాడుతున్న హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు మెట్టు శ్రీధర్

బొల్లారం, డిసెంబర్ 14: బొల్లారం పారిశ్రామిక వాడలో యథేచ్ఛగా వాయు, నీటి కాలుష్యానికి కారణమవుతున్న రసాయన పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని ఉమ్మడి మెదక్ జిల్లా హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు మెట్టు శ్రీధర్ డిమాండ్ చేశారు. శనివారం బొల్లారం పారిశ్రామికవాడలోని ఆసానికుంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూర్తిగా రసాయన వ్యర్థ జలాలతో కుంట దుర్గంధం వెదజల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్య రసాయనాలను బోర్వెల్ ద్వారా రివర్స్ పంపింగ్ చేసి భూగర్భ జలాలను కాలుష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశ్రమల నీరు గండిగూడెం చెరువులో చేరి చేపలు, పశువులు మృతి చెందుతున్నాయని వాపోయారు. ఇంత జరుగుతున్నా అధికారులు నిద్రమత్తులో ఉంటున్నారని ఆరోపించారు. దేశంలోని 131 నగరాల్లో కాలుష్యంపై అధ్యయనం చేయగా అందులో సంగారెడ్డి జిల్లా కూడా ఉన్నదని చెప్పారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని పాశమైలారం, బొల్లారం, కాజిపల్లి ప్రాంతాల్లో కాలుష్యం పెరుగుతోందని అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే ఈ ప్రాంతాలు మరింత విషతుల్యంగా మారే ప్రమాదం ఉందన్నారు. రసాయన పరిశ్రమలు కాల్వల ద్వారా చిన్న వాగు, పెద్దవాగు, నక్క వాగులో కలిపే నీరంతా మంజీరా నదిలోకి వెళ్లి కాలుష్యం అవుతున్నదని, నది మరో మూసిగా మారక ముందే ప్రభుత్వం స్పందించాలని కోరారు. కార్యక్రమంలో యువజన నాయకులు రోహిత్ సింగ్, అరవింద్, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

DOCUMENT LOST

I, MOHAMMED ZAHEER, S/o. Mohammed Khadeer, R/o. Villa No.166, BDL Road, Bhanur (V), Patancheru (M), Sangareddy (D), T.S., I am the document holder of the property of an open plots bearing no's. 27, 28, 29 & 30, in Sy.No. 429, total admeasuring area 800 Sq. Yards, situated at Patancheru, Sangareddy (D), T.S. That, the said property's original document **Regd. Sale deed vide Doc. No. 3709/1983, Dated: 14-11-1983, Regd. at S.R.O. Sangareddy,** have been lost by me while travelling on motor cycle from Patancheru to Muthangi on 10-8-2024. If anybody found please Contact:8500254818